# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్ర ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలుగులో ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యంగా పని చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలియజేశారు.
- విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా స్వర్ణ భారతి ట్రస్టు పని చేస్తోందని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు పేర్కొన్నారు.
- విశాఖపట్నం వేదికగా ఈరోజు సన్ రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య ఐపీఎల్ మ్యాచ్ జరుగుతోంది.

==================

ఉగాది పండగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలుగులో ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజ ప్రసారమైన మన్ కీ బాత్ మనసులోని మాట కార్యక్రమం 120వ సంచికలో ప్రధానమంత్రి మాట్లాడుతూ... ఉగాది పండుగను కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రా రాష్ట్ర ప్రజలు చాలా ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ పండుగ సందర్భంగా దేశ ప్రజలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భారతదేశ వైవిధ్యత, ఐక్యతలను పండుగలు ప్రతిభింభిస్తాయన్నారు. ఈ ఐక్యతా భావాన్ని నిరంతరం బలోపేతం చేసుకోవాలని ప్రజలకు సూచిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

పరీక్షలు ముగిసి వేసవి సెలవులు రానున్న తరుణంలో పిల్లలు కొత్త నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవడానికి కృషి చేయాలని చెప్పారు. టెక్నాలజీ క్యాంప్ లో పాల్గొని నూతన యాప్‌లను తయారు చేయడం, ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ గురించి తెలుసుకోవచ్చన్నారు. పర్యావరణం, నాటక రంగం వంటి వివిధ విషయాలపై కోర్సులు ఉంటే, వాటిలో కూడా భాగమవ్వాలని సూచించారు. అలాగే నీటి సంరక్షణ గురించి ప్రధానమంత్రి మాట్లాడుతూ.. గత 7, 8 సంవత్సరాలలో

కొత్తగా నిర్మించిన ట్యాంకులు, చెరువులు, ఇతర నీటి రీఛార్జ్ నిర్మాణాల ద్వారా 11 బిలియన్ క్యూబిక్ మీటర్లకు పైగా నీటిని సంరక్షించడం జరిగిందని వెల్లడించారు.

=================

సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యంగా పని చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు తేవాలని, సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి ఈరోజు పాల్గొన్నారు. అనంతరం మాడుగుల నాగఫణి శర్మ పంచాంగ శ్రవణం చేశారు. టీటీడీ పంచాంగం, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ పంచాంగాలను, రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ వార్షిక ఉత్సవాల క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ... పేదరికం లేని సమాజమే తన జీవితాశయమని... అందులో భాగంగానే పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. సంపద కొందరికే పరిమితం కాకూడదని... ప్రతి ఒక్కరికీ మెరుగైన జీవన ప్రమాణాలు అందినప్పుడు సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని చెప్పారు. ఈరోజు ఉగాది పర్వదినాన మార్గదర్శి- బంగారు కుటుంబం జీరో పావర్టీ-పీ4కు శ్రీకారం చుట్టామని తెలిపారు. సంపన్నులు పేదలను ఆదుకుని, వారిని ఆర్థికంగా పైకి తేవాలన్నారు. అందరికీ విద్య, వైద్యం అందాలని దాతృత్వంలో తెలుగువాళ్లు ప్రపంచానికే ఆదర్శం కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

(వాయిస్ 33 సెకన్లు)

విరామం

=================

ఉగాది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా 86 మందికి కళారత్న, 116 మందికి ఉగాది పురస్కారాలను ప్రధానం చేసింది. అందులో భాగంగా ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగంలో న్యూస్ రీడర్‌గా పని చేస్తున్న కనపర్తి రాణి ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ పురస్కారాన్ని అందుకున్న అనంతరం ఆమె మాట్లాడుతూ...

(వాయిస్ 23 సెకన్లు)

=================

కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్ట్ లో పూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాధి ఉత్సవాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. నైపుణ్య శిక్షణ ద్వారా వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా దృవపత్రాలను, ఉపకరణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ... స్వర్ణ భారత్ ట్రస్ట్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసి స్వయం ఉపాధి పొందే విధంగా వృత్తి విద్యా కోర్సులలో శిక్షణను అందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో బ్యాంకు రుణాలను అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామని వెంకయ్య నాయుడు తెలిపారు.

=================

గుంటూరు జిల్లాలో నూతన తెలుగు సంవత్సరాదిని నగరంలోని వెంకటేశ్వర స్వామివారి దేవాలయంలో ఈరోజు నిర్వహించారు. ఈ వేడుకలలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొని పలువురిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో కవులు, కళాకారులను మరింతగా ఆదరించాలని అభిలషించారు. సమాజంపై సంపూర్ణ  అవగాహన ఉన్న కవిత్వం రాయగలరని అభిప్రాయం వ్యక్తం చేశారు. సమాజాన్ని, ధర్మాన్ని కాపాడేవారిని గుర్తించి సత్కరిస్తానని, నగరాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

==================

ప్రతినెల చివరి ఆదివారం ప్రసారం అయ్యే ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజల్లో విశేష స్పందన లభిస్తోంది. ఈ రోజు జరిగిన మన్ కీ 120వ సంచికను అనంతపురం జిల్లా ప్రజలు, యువత ఎంత ఆసక్తిగా విన్నారు. ఈ సంచికలో ప్రధానంగా నీటి సంరక్షణ, క్రీడలు, యోగ, ఫిట్ ఇండియా కార్యక్రమం స్పందన లాంటి ఎన్నో ఉపయోగకర విషయాలను ప్రధానమంత్రి ప్రజలకు వివరించడం జరిగిందని... ఈ సూచనలు, సలహాలను ఆచరిస్తామని అనంతపురం నగర ప్రజలు తెలిపారు.

(వాయిస్ 19 సెకన్లు)

==================

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) లో భాగంగా విశాఖపట్నం వేదికగా ఈరోజు సన్ రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సన్ రైజర్స్ జట్టు 164 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 7 ఓవర్లకు నష్టోపోకుండా 67 పరుగులు చేసింది. ఇదిలా ఉండగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఐసీసీ చైర్మన్ జై షాతో కలిసి ఈ మ్యాచ్ ను వీక్షించారు.

==================

ప్రభుత్వం అందిస్తున్న పీఎంఈజీపీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని, యూనిట్లను లాభదాయకంగా నిర్వహించి కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈరోజు విజయనగరంలోని మంత్రి కార్యాలయంలో పీఎంఈజీపీ కింద నలుగురు లబ్ధిదారులకు ఆటోలను అందజేశారు. ఈ పథకం లబ్ధిదారులకు ఆర్థిక స్వావలంబనను అందించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిని పెంచడానికి దోహదం చేస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

==================
==================